నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

సోమవారం 25 డిసెంబర్ 2023
MONDAY, DECEMBER 25, 2023 | VIKARABAD | పేజీలు : 8 PAGES




పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం

'సబ్బండ వర్ణాలు మెచ్చుకునేలా తొమ్మిదిన్నరేండ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన కొనసాగింది. అప్పులు కాదు.. చెక్కుచెదరని అభివృద్ధితో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడ్డాయి. ఇందుకు సంబంధించి ఆదివారం తెలంగాణ భవన్ వేదికగా తొమ్మిదిన్నరేండ్ల కాలంలో సాధించిన ప్రగతి, సృష్టించిన ఆస్తులపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'స్వేద' పత్రాన్ని విడుదల చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి ఏమిటి ? బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ఏమిటి ? వంటి ఎన్నో అంశాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ఉమ్మడి జిల్లా వాసులు టీవీలు, సెల్ ఫోన్లకు అతుక్కుపోయి కేటీఆర్ చెప్పిన ప్రతి మాటను ఆసక్తిగా విన్నారు.




తెలంగాణ భవన్‌లో 'స్వేదపత్రం' విడుదల చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## అప్పులు కాదు..

# చెక్కుచెదరని అభివృద్ధి

- తొమ్మిదిన్నరేండ్లలో ఉమ్మడి జిల్లాలో ఎనలేని అభివృద్ధి, సంక్షేమం
- సంక్షోభంలోనూ ఆగని 'ప్రగతి' రథం
- కరువు నేలపై.. కృష్ణమ్మ నీటి గలగలలకు పాలమూరు ఎత్తిపోతల పథకం
- భారీ పెట్టుబడులతో పారిశ్రామికరంగం అభివృద్ధి
- తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే అగ్ర భాగాన
- వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత
- రోడ్ల నిర్మాణాలతో రవాణా వ్యవస్థ మెరుగు
- తెలంగాణ భవన్‌లో 'స్వేదపత్రం' విడుదల చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- టీవీలకు అతుక్కుపోయి ఆసక్తిగా వీక్షించిన జనం

అభివృద్ధి, తలసరి ఆదాయంలోనూ ఉమ్మడి జిల్లా అగ్రగామిగా నిలిచింది. టీఎస్ఐపాస్ ఏర్పాటుతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పారిశ్రామిక రంగం కొత్త పుంతలు తొక్కింది. భారీ పెట్టుబడులతో పెద్దపెద్ద కంపెనీలు నెలకొల్పగా, ఎంతో మందికి ఉపాధి లభించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుతో కరువు కనుమరుగుకానున్నది. ఉద్దండాపూర్ రిజర్వాయర్ కింద ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 6 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సాగు నీరందనున్నది. పాలమూరు ఎత్తిపోతలతో కరువు ప్రాంతాలకు సైతం పుష్కలంగా కృష్ణా జలాలు అందనున్నాయి. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ల నిర్మాణాలతో ప్రజలకు పాలన చేరువైంది. పల్లె, పట్టణ ప్రగతి, రైతు వేదికలు, మన ఊరు-మన బడి , మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఉచిత విద్యుత్, రోడ్ల నిర్మాణాల వంటి అద్భుతమైన అభివృద్ధి పథకాలతో రెండు జిల్లాల రూపురేఖలు మారాయి. రైతుబంధు, రైతుబీమా, చేప పిల్లల పంపిణీ, గొర్రెల పంపిణీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ ఫలాలు ప్రతి పల్లెకూ అందాయి. ఎన్ని ప్రకృతి విపత్తులు ఏర్పడినా.. సంక్షోభంలోనూ 'ప్రగతి' రథం సాగింది. వైద్య రంగానికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల మంజూరు, నర్సింగ్, ఆయుష్ కాలేజీలు, మాతాశిశు ఆసుపత్రితోపాటు బస్తీ, పల్లె దవాఖానలతో ఉమ్మడి జిల్లావాసులకు మెరుగైన వైద్యసేవలందాయి. అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా చెక్కుచెదరని అభివృద్ధి జరిగింది.

—సెంటర్ స్ప్రెడ్‌లో..—

– వికారాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ)

వికారాబాద్ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్



# క్రిస్మస్ కాంతులు



వికారాబాద్ జిల్లాలోని మర్పల్లిలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చి

సర్వాంగ సుందరంగా ముస్తాబైన చర్చిలు

క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు, విద్యుత్ దీపాలతో చర్చిల కనువిందు

ఉమ్మడి జిల్లాలోని చర్చిల్లో నేడు జరిగే క్రిస్మస్ వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు

తెల్లవారుజాము నుంచే ఆరాధనలు

వ్యాక్యోపదేశాలివ్వనున్న బిషప్‌లు

వేడుకల్లో పాల్గొననున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

## కలెక్టర్ భారతి హోళికేరీపై

# బదిలీ వేటు !



- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రుకు పూర్తి అదనపు బాధ్యతలు
- జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు రిపోర్టు చేయాలని హోళికేరీని ఆదేశించిన సీఎస్
- రెండున్నర నెలల వ్యవధిలోనే ఇద్దరు కలెక్టర్లు బదిలీ

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరీపై బదిలీ వేటు పడింది. ఆమెకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతి కుమారి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమావేశం ముగిసిన కొద్ది గంటల్లోనే బదిలీ ఉత్తర్వులు వెలువడడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పొట్రుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. రెండున్నర నెలల వ్యవధిలోనే ఇద్దరు కలెక్టర్లపై బదిలీ వేటు పడింది.

– రంగారెడ్డి, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ)